క్లుప్తంగా

'ప్రాజెక్టు పేరు మార్చడం సరికాదు'

దామరగిద్ద: దక్షిణ తెలంగాణకు సాగు, తాగు నీరందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం సరికాదని సామాజిక కార్యకర్త బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వంలో కీలక మంత్రిగా పనిచేసిన జైపాల్‌రెడ్డి తెలంగాణకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. దక్షిణ తెలంగాణ రైతులకు వరప్రదాయినిగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 90 శాతం పనులు పూర్తి చేసిన ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మామ మీద మమకారంతో ప్రాజెక్టు పేరును మార్చాలనుకోవడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. నిజాం రజాకార్లను, భూస్వాములను ఎదురించి పేదలకు సంపదను పంచి పెట్టిన పండగ సాయన్న పేరును పెట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీ పటిష్టతకు కృషి



ఊట్కూర్: బీజేపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ అన్నారు. ఆదివారం ఓబులాపూర్ గ్రామంలో 30వ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా మహిపాల్ రెడ్డి, ప్రధాన కర్యదర్శిగా శంకర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, అశోక్, తిమ్మప్ప, గోపాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముడుమాల్ మహిబూబ్ సుబాని ఉర్సు

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో మహిబూబ్ సుబాని ఉర్సు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం గంధోత్సవాలతో ప్రారంభమై బుధవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకుడు మౌలాలీ తెలిపారు. సోమవారం ఉదయం దర్గాలో పూలతో పూజలు, సాయంత్రం జ్యోతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు స్థానికులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాది వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండగా తాగునీరు, వసతి ఇతర అన్ని సౌకర్యాలను కల్పించారు.

మిర్చి ధరలు పెంచాలి

మరికల్: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని మిర్చి రైతు సంఘం నాయకులు శ్రీను, రాములు, వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ మిర్చికి కనీస మద్దతు ధర రూ. 20 వేలు ఉండాలన్నారు. క్వింటాల్‌కు రూ.10 వేల లోపు ధర నిర్ణయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తు చేశారు. ఎకరాకు రూ.70 వేల పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగు చేస్తే తీరా ధరలు లేక పెట్టుబడి కూడా రాని పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వమే మిర్చికి మద్దతు ధర ప్రకటించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థికి బంగారు పతకం



నారాయణపేట రూరల్: షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా 38వ కుంగ్‌ఫు కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దామరగిద్దకు చెందిన శివశంకర్ బంగారు పతకం సాధించాడని నిర్వాహకులు అశోక్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థికి నిర్వాహకులు పతకంతో పాటు సర్టిఫికెట్ అందజేశారు.

ఎల్లమ్మ దేవర్లకు శాంతి పూజలు



అమరచింత: మండల కేంద్రంలోని బీరప్ప, ఎల్లమ్మ దేవర్లకు ఆదివారం శాంతి పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పత్తి కురువలు ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు ముందు దేవర్లకు శాంతి పూజలను నిర్వహిస్తుంటారు. ఆదివారం మేళతాళాలతో సమీపంలోని కృష్ణానదికి వెళ్లి పవిత్ర కృష్ణా జలాలను తీసుకొచ్చి దేవర్లకు అభిషేకించారు. బీరప్ప, ఎల్లమ్మ దేవర్ల పాదుకలను శుద్ధి చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అదే విధంగా మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యర్థాలు కాల్చడంతో పంటకు నష్టం



దామరగిద్ద లో వరి పంట వ్యర్థాలకు కాల్చిన పొలం.

- మేలు చేసే సూక్ష్మజీవుల నాశనం
- తగ్గనున్న కర్బన పదార్థం
- హానికర వాయువుల విడుదల

దామరగిద్ద: వ్యవసాయంలో రోజురోజుకూ యాంత్రీకరణ పెరగడంతో పశు పోషణ గణనీయంగా తగ్గింది. దీంతో వరి గడ్డి వినియోగం తగ్గడంతో రైతులు పంట పొలంలోనే తగలబెడుతున్న పరిస్థితులు దాపురించాయి. గతంలో పంట వ్యర్థాలను పశువుల మేతగా ఉపయోగించి పేడను తిరిగి పంట పొలాలకు ఎరువుగా ఉపయోగించి నేల సారాలన్ని పెంపొందించుకునేవారు. సాంప్రదాయం నుంచి యాంత్రీకరణ వైపు రైతులు అడుగులు వేస్తుండడంతో భూమికి కావాల్సిన సారం కృత్తిమంగా దొరకడం లేదు. పంట వ్యర్థాలను నేలలో కలియదున్నకుండా కాల్చి వేయడంతో నేలసారాన్ని రైతులు చేతులారా నాశనం చేసుకున్నట్లు అవుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాల్చివేతతో నష్టాలు

పంటకోత సమయంలో హార్వేస్టర్లను ఉపయోగించి పంట నూర్పిడి చేయడంతో నేలలోనే వరిగడ్డి, వరికొయ్యలు వ్యర్థాలు మిగిలిపోతున్నాయి. సేద్యానికి ముందు వరి, కంది, పత్తి పంట వ్యర్థాలను రైతులు కాల్చివేయడంతో భూసారం తగ్గడం, నేల పైపొరలో మేలు చేసే సూక్ష్మజీవులతో పాటు జింక్, కాపర్, మాంగనీస్, కర్బన పదార్థాలు, నత్రజని, సల్ఫర్ నశిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంటున్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేల సారం కోల్పోవడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే వాయువులు వెలువడుతున్నాయి.

పంట అవశేషాలతో ప్రయోజనాలు

పంట వ్యర్థాలను నేలలోనే కలిసిపోయేలా కలియదున్నడం వల్ల భూసారాన్ని పెంచుకోవడం, పంట అవశేషాలను వివిధ రకాల జీవుల సమ్మేళనంతో (వేస్ట్ డీ కంపోజర్) కంపోస్టింగ్ పద్ధతిలో వాడుకోవడంతో భౌతిక రసాయన చర్యల వల్ల భూసారం పెంచుకోవడంతో పాటు నీరు నిలిచే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. భూమి దమ్ము చేసే ముందు వ్యర్థాలపై ఎకరాకు 3 బస్తాల సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లడం ద్వారా అవి కుళ్లిపోయి ఎరువుగా ఉపయోగపడుతుంది. వరి గడ్డిని యంత్రాల ద్వారా బేళ్లుగా చుట్టి పశుగ్రాసంగా నిల్వ చేయడం, పుట్ట గొడుగుల పెంపకానికి ఉపయోగించడం, పశువుల పాకలో పరుపుగా వాడటం వంటి ప్రయోజనాలను పొందవచ్చు.

భూ సారం తగ్గుతుంది



రైతులు పంట అవశేషాలను కాల్చడం మంచి పద్ధతి కాదు. పంట వ్యర్థాలను కాల్చివేయడంతో భూసారం తగ్గడం, నేల పైపొరలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయి. జింక్, కాపర్, మాంగనీస్, వంటి సూక్ష్మపోషక పదార్థాలు నశిస్తాయి. దమ్ము చేసే సమయంలో వ్యర్థాలను సింగిల్ సూపర్ పాస్పేట్ ఉపయోగించి డీకంపోజ్ చేయడం ద్వారా నేల సారం పెంచుకోవచ్చు.

– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి, నారాయణపేట

రైతు భరోసాపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

మరికల్: రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బీజేపీ సభ్యత్వాల నమోదు జిల్లా కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మరికల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చి రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమే అన్నారు. అలాగే రైతులకు రూ. 2 లక్షల రుణామాఫీ, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, కౌలు రైతులకు ఆర్థికసాయం, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు, మహిళలకు రూ.2,500 ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీగా ఉందని, పథకాలు అమలు చేయమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.1.30లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రానికి ఏమి చేశారని నిలదీశారు. రాష్ట్ర ఆదాయ వనరులపై అవగాహన లేకనే ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో నర్సన్‌గౌడ్, రమేష్, మహేష్, శ్రీరామ్, వెంకటేష్, చెన్నయ్య, స్వామి, సురేందర్‌గౌడ్, నాగేష్ పాల్గొన్నారు.

హోన్నలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమైన హోన్నలింగేశ్వరస్వామి వారి ఆలయం



స్వామివారి రథం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్, ముడుమాల్ గ్రామాల మధ్య వెలసిన హోన్నలింగ మహాస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హోన్న లింగేశ్వరస్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో గుడెబల్లూర్, ముడుమాల్ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. సోమవారం ఉదయం స్వామివారి అలంకారంతో ప్రారంభమై 13న పల్లకీలో స్వామివారిని గంగా స్నానం కోసం కృష్ణానదికి తీసుకెళ్లడం, గుడెబల్లూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తారు. 14న ఉదయం ఆలయంలో అభిషేకం, సాయంత్రం స్వామి ప్రభోత్సవం, 15న సాయంత్రం రథోత్సవం, అభిషేకం, మహాపూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం ఆవరణలో ప్రతిరోజు భక్తి ప్రవచన కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

– శ్రీ హోన్న లింగేశ్వర మహాస్వామి.శ్రీ క్షేత్ర పీఠాధిపతి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



తమ పిల్లలతో కలిసి సమ్మె చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 25వ రోజుకు చేరుకుంది. సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటు వారి పిల్లలు సైతం నిరసనలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి మద్దతు పలుకుతూ మాట్లాడారు. తెలంగాణ సిద్ధిస్తే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థ ఉండదని, అందరిని పర్మినెంట్ చేస్తామని ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పదేళ్లు సీఎంగా పరిపాలించి పట్టించుకోలేదన్నారు. ప్రజాపాలన అంటున్న ప్రస్తుత సీఎం ఒకప్పుడు వీరి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు హామీ నెరవేర్చకపోవడం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును పాలకులు అపహాస్యం చేస్తున్నారని, తక్షణమే సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డిమాండ్ చేశారు.

పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్

నారాయణపేట రూరల్: ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 2న పూసల్ పహాడ్ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు శేరి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే జిల్లా వ్యాప్తంగా 22వ సారి అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని మండలాల్లో పరీక్ష కేంద్రం ఉంటుందని, 150 మార్కులకు మల్టిపుల్ చాయిస్ విధానంలో బబ్లింగ్ చేయాలని, రెండు గంటల సమయం ఉంటుందని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని, పూర్తి సిలబస్ ప్రిపేర్ కావాలని, పాల్గొనే విద్యార్థులు ఈ నెల 27లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల దగ్గర పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సారి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేర్వేరుగా బహుమతులు ఉంటాయని, ఇరు విభాగాల్లో మొదటి ముగ్గురికి క్యాష్ అవార్డులు, టాప్ టెన్ లో నిలిచిన చిన్నారులకు ప్రత్యేక బహుమతులు, స్కూల్ టాపర్‌కు ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. ప్రతిభను వెలికి తీయుటకు సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఈ టాలెంట్ టెస్టును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: పది ఉత్తీర్ణత సాధించి ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన 25 ఏళ్ల వయస్సు లోపు ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొదటి ఆరు నెలల శిక్షణ కాలానికి రూ.12వేల స్టైఫండ్ ఇస్తూ తిరుపతి వద్ద నున్న అమర రాజా ఫ్యాక్టరీలో శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత మహబూబ్‌నగర్ వద్ద గల బ్యాటరీ కంపెనీలో రూ.15వేల వేతనంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళా అభ్యర్థులు సోమవారం కాడా కార్యాలయం, కొడంగల్‌లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

24 గంటల పాటు కరెంట్ ఇవ్వాలి

మరికల్: వరినాట్ల సమయంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రఘు, రాము ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పగటి సమయంలోనే వ్యవసాయానికి 9 గంటల కరెంట్ సరఫరా చేయడం వల్ల పారిన మడే మళ్లీ, మళ్లీ పారుతుండటంతో కరిగెట కావడం లేదని వాపోయారు. 24 గంటల కరెంట్ ఉంటే ఒకేసారి నీళ్లు పారుతుందన్నారు. దీంతో వరినాట్లకు ఆటంకం లేకుండా ఉంటుందని వివరించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణపేట: ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ట్రెయినీ ఎస్ఐ గాయత్రి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు, వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపే కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే నిధులు స్వాహా




పిల్లర్ల దశలో నిలిచిన తరగతి నిర్మాణ పనులు

- 2008 నుంచి సాగని తరగతి గదుల పనులు
- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న విద్యార్థులు

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలోనే హైస్కూల్‌ను కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 200 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో జనవరి 6, 2008లో రూ.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే స్వర్ణసుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పునాది లెవల్లో నిర్మాణ పనులు చేపట్టి అందిన కాడికి బిల్లులు డ్రా చేసుకున్న కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఆనాటి నుంచి నేటి వరకు పనులు నిలిచిపోయాయి. సరైన తరగతి గదులు లేకపోవడంతో వరండాల్లోనే విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు. దీనికి తోడు మరుగుదొడ్లు, మూత్రశాల, తాగునీటి సౌకర్యం లేకపోవడం లాంటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే విద్యార్థులపై సమస్యపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

బస్తీ దవాఖానాకు అటెండరే దిక్కు!

- వైద్యులు, సిబ్బంది లేక వెలవెల
- రోగులకు అందని వైద్యం



ఆత్మకూర్ బస్తీ దవాఖానా

ఆత్మకూర్: పట్టణంలోని కుర్వవీధిలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది. 2023, డిసెంబర్ 3న రోగుల సౌకర్యార్థం రూ.13లక్షలు ఖర్చుచేసి అప్పటి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దవాఖానా ప్రారంభించారు. కొన్నాళ్ల పాటు ఒక వైద్యుడు, నర్సు, అటెండర్ నిర్వహణలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో కొన్నాళ్లకు డిప్యూటేషన్‌పై వైద్యురాలిని నియమించారు. అనంతరం వైద్యురాలు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడంతో అటెండర్ నిర్వహణలోనే ఆస్పత్రి కొనసాగుతుంది. ఎమ్మెల్యేతో పాటు జిల్లా వైద్యాధికారి దృష్టి సారించి వైద్యులు, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

'రైతు డిమాండ్ డే'ను జయప్రదం చేద్దాం



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

నారాయణపేట రూరల్: జనవరి 9న ఇండియా రైతు డిమాండ్ డే గా జరపాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని ఆ సంఘం నాయకులు రాములు, సుభాష్ అన్నారు. మండలంలోని కోటకొండలో ఆదివారం వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ బీజేపీ 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫారసుల అనుకూలంగా మద్దతు ధరలు అమలు చేస్తామని, పంట పెట్టుబడిపై 50శాతం కలిపి ధర నిర్ణయిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని విమర్శించారు. రైతుల నడ్డి విరిచే విధంగా మూడు కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను తీసుకురావడం సరికాదన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు 13 నెలలుగా ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టగా కార్పొరేట్ వ్యవసాయం చట్టాలను వెనక్కి తీసుకోవాలని, రైతులపై ఉన్న కేసులును ఉపసంహరిచు కోవాలని, అమరులైన రైతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరిన డిమాండ్లను పరిష్కరించలేదని మండిపడ్డారు. అదేవిధంగా ఇచ్చిన హామీ ప్రకారంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు పంటలకు రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం రైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భీమేష్, లక్ష్మప్ప, వెంకటయ్య, రాములు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్వ ఉన్నత పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మద్దూరు ఉన్నత పాఠశాలలో..



నారాయణపేటలో..

మద్దూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు మరోమారు కలుసుకొని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో గురువు ఆర్.రాంరెడ్డి, పూర్వ విద్యార్థులు రహీం, హబీబ్, అంబటి రాములు, విజయ్ కుమార్, రవి పాల్, ఎక్బాల్‌పాష తదితరులు పాల్గొన్నారు.

నర్వ: నలభై ఏళ్ల క్రితం పదో తరగతి చదుకొని ఎక్కడెక్కడో స్థిరపడ్డ వాళ్లంతా కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నర్వ ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సుందరయ్య, సంజన్న, కృష్ణయ్య, బ్రహ్మయ్య, కురుమూర్తి, పూర్వ విద్యార్థులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, సిద్ధయ్య, సత్యన్న ఆచారి, నర్సిములు, నజీర్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న మిత్రులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి శాలువా, జ్ఞాపకలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్రెడ్డి, రాఘవేంద్ర చారి, పటికె సత్యనారాయణ, ఎల్లగ్ శశిధర్, సుదర్శన్, మొల్గన్ జనార్దన్, వెంకటేశ్వర్రెడ్డి, సక్సేనా, శశికళ, శ్రీలత, రాజు, శ్రీధర్రెడ్డి, మల్లికార్జున్, అటెండర్ నర్సింలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆత్మకూర్: మూడు రోజులుగా కొనసాగిన మల్లాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిసాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గరుడ హోమం, మన్యుసూక్త హోమం, ప్రాయశ్చిత హోమాలు, బలి ప్రధానం, పూర్ణాహుతి హోమం, పుష్పయాగం, చక్రస్నానంతో కార్యక్రమాలు ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో మండలంలోని ఆయా గ్రామాల భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తుల వేలాదిగా తరలొచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అవాంతరాలు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుని తీర్థప్రసాదాలు అందించారు.

శబరికి తరలిన అయ్యప్ప దీక్షాపరులు

అమరచింత: మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప దీక్ష చేపట్టిన మాలధారులు ఇరుముడి కట్టుకుని శబరియాత్రకు బయలుదేరారు. గురుస్వాములు మాకం నరసింహులు ఆధ్వర్యంలో దీక్షాపరులకు ఇరుముడి కట్టి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరికి వెళ్తున్న మాలధారులు పట్టణంలో అయ్యప్ప స్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరియాత్రకు వెళ్లారు.